విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం 5
శ్రీ సత్యసాయి
బుధవారం 11- 02 - 2025

# ఇది దళారుల ప్రభుత్వం
# రైతుల కష్టాలు మంత్రులకు కన్పించడం లేదా?



- ఏ పంటకూ గిట్టుబాటు ధర లేని దయనీయం
- ఒక్క సమీక్ష చేసే ఓపిక ప్రజాప్రతినిధులకు లేదా?
- వ్యాపారులు, దళారులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం
- 9 నెలలు తిరక్కుండానే 1.26 లక్షల కోట్ల అప్పు
- మంగళవారం అప్పులవారంగా మార్చిన చంద్రబాబు
- చివరకు మందుబాబులనూ మోసం చేసిన ఘనుడు
- ముడుపుల కోసమే 14 శాతం మార్జిన్ పెంపు
- మద్యం వ్యాపారంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు భాగస్వామ్యం
- ఊసరవెల్లి కూడా సిగ్గుపడేలా చంద్రబాబు తీరు
- వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపాటు

అనంతపురం, ఫిబ్రవరి11 (అనంత ప్రభ)

ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తే గిట్టుబాటు ధరలు అందక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం వ్యాపారులు, దళారులకు కొమ్ముకాస్తోందని మండిపడ్డారు. సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగు చేసిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఒక్క సమీక్ష చేసే ఓపిక కూడా ప్రజాప్రతినిధులకు లేకపోవడం శోచనీయమని తెలిపారు. ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుని అధికారంలోకి వచ్చాక మాటలకే పరిమితం అవుతున్నారని విమర్శించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నిత్యం గత ప్రభుత్వం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ల పంపిణీ మాత్రమే చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తే ఇప్పటికే ఈ ప్రభుత్వం 1.50 లక్షల పింఛన్లకు కోత పెట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తానని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. 9 నెలలు కూడా కాకుండానే ఏకంగా రూ.1.26 లక్షల కోట్లు అప్పు తెచ్చారన్నారు. ప్రతి మంగళవారం అప్పుల వారంగా మార్చిన ఘనత చంద్రబాబుదని విమర్శించారు. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు.. అప్పులు సృష్టిస్తూ అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

**పంటలకు గిట్టుబాటు ధర ఏదీ?**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతాంగం కష్టాలను పట్టించుకోవడం లేదని అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటంగా మద్దతు ధర ప్రకటించినా క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగడం లేదన్నారు. పంట అంతా దళారుల పాలవుతోందన్నారు. రైతులు శనగ విత్తనం వేసే సమయంలో క్వింటాల్ ధర రూ.7800 నుంచి రూ.8 వేలు ఉంటే ఈ రోజు రూ.5500కు పడిపోయిందన్నారు. ఇందులో కూడా రంగు మారిందని చెప్పి క్వింటాల్‌కు 10 నుంచి 15 కిలోలు ఉచితంగా ఇవ్వాలని అంటున్నారన్నారు. కందులు గత ఏడాది క్వింటాల్ రూ.9 వేల నుంచి రూ.10 వేలు పలికితే నేడు రూ.6300 నుంచి రూ.6400 ఉందన్నారు. కొర్రలు గత ఏడాది రూ.6 వేలు ఉంటే ఇప్పుడు రూ.2300 ఉందన్నారు. మొక్క జొన్న కూడా గత ఏడాది రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ధర పలికితే నేడు రూ.2 వేలు మాత్రమే ఉందన్నారు. ఇక వేరుశనత రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. 40 కేజీల బస్తా గత ఏడాది రూ.3600 నుంచి రూ.3800 ఉండేదని, కానీ నేడు రూ.2600కు పడిపోయిందన్నారు. పత్తి మద్దతు ధర రూ.7412 ఉంటే రూ.5500 కే అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. మిరప (క్వాలిటీ) గత ఏడాది రూ.40 వేల నుంచి రూ.41,500 ఉంటే నేడు రూ.7 వేల నుంచి రూ.9 వేలు పలుకుతోందని చెప్పారు. సాధారణ మిరప గతంలో రూ.25 వేల నుంచి రూ.30 వేలు పలికితే నేడు కేవలం రూ.5500కు అమ్ముకుంటున్నారని అన్నారు. అరటి పంట పది రోజు క్రితం వరకు టన్ను రూ.30 వేలు ఉంటే నేడు రూ.23 వేలకు పలుకుతోందన్నారు. చీనీ రైతులు కూడా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. 10 టన్నులకు 2.5 టన్నులు సూట్ రూపంలో వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఇలా అన్ని పంటల పరిస్థితి దారుణంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మరోవైపు భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని.. హెచ్‌ఎల్‌సీ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పరిసర ప్రాంతాల్లో మాత్రమే నీళ్లు ఉన్నాయన్నారు. అసలు భూగర్భ జలాలే ఇంకిపోతున్న తరుణంలో 9 గంటల ఉచిత విద్యుత్ వద్దే వద్దు అని రైతులు మొరపెట్టుకుంటున్నారని తెలిపారు. ఫర్టిలైజర్స్, ఎరువుల దోపిడీ జరుగుతున్నా విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు గ్రామాల్లోకి వెళ్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయన్నారు. మరోవైపు మార్కెట్ యార్డుల్లో కమీషన్ల దందా సాగుతోందని మండిపడ్డారు. ప్రైవేట్ మార్కెట్లతో పాటు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మార్కెట్‌లు కూడా దళారుల చేతుల్లోకి వెళ్లిపోయాయన్నారు.

**క్షేత్రస్థాయిలో వైఫల్యాలు కన్పించడం లేదా?**

క్షేత్రస్థాయిలో రైతాంగం పడుతున్న కష్టాలు ఎమ్మెల్యేల నుంచి ముఖ్యమంత్రి వరకు కన్పించడం లేదా? అని అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల్లో ఖర్చు చేశాం.. ఇప్పుడు సంపాదించుకుంటాం అనే రీతిలో ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కళ్లు తెరవాలని సూచించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య కూడా ఎదురవుతోందని.. ఇప్పటికే శింగనమల, నార్పల, పామిడి వంటి మండలాల్లో నీటి ఇక్కట్లు ప్రారంభం అయ్యాయని తెలిపారు. రైతు సమస్యలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రతి సోమవారం స్పందనలో ఇస్తున్న అర్జీలకు కూడా పరిష్కారం లభించడం లేదన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఈఆర్వోలు నిర్లక్ష్యం వీడి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు.

**మందుబాబులనూ మోసం చేసిన చంద్రబాబు**

అలవికాని హామీలతో అన్ని వర్గాలను మోసం చేసినట్టే మందుబాబును కూడా చంద్రబాబు మోసం చేశారని అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. రైతులు పండిచిన పంటకు గిట్టుబాటు ధర లేదు గానీ, మద్యం అమ్ముకునే వాళ్లకు మాత్రం కమీషన్లు పెంచుతున్నారని విమర్శించారు. ఇదే సమయంలో మద్యం ధరలను కూడా పెంచారన్నారు. ఎన్నికలకు ముందు బహిరంగ సభల్లో నాణ్యమైన మద్యం ఇస్తాను..బాగా తాగండి అని ప్రచారం చేసిన రాజకీయ నాయకుడు ఈ దేశంలో ఎవరైనా ఉన్నారా? అంటే అది చంద్రబాబు మాత్రమేనని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం వ్యాపారంలో మంత్రులు, ఎమ్మెల్యేల భాగస్వామ్యం ఉందన్నారు. అందుకే మార్జిన్ పెంచి దండుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి మద్యం ద్వారా ఏటా రూ.30 వేల కోట్ల ఆదాయం వస్తుందని.. 14 శాతం మార్జిన్ పెంచడం వెనుక ప్రభుత్వ అధినేత, వ్యాపారస్తులకు మధ్య అగ్రిమెంట్ జరిగిందన్నారు. మరోవైపు ఎక్కడ చూసినా బెల్ట్ షాపులు వెలుస్తున్నాయన్నారు. ఏపీలో మార్జిన్ పెంచి ముడుపులు తీసుకోవడంతో పాటు కర్ణాటక నుంచి మద్యం తెచ్చి బెల్ట్‌షాపులకు తరలించి అక్రమార్జనకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబును చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుతో తలదించుకుంటుంది.. లేదంటే ఇన్ని రంగులు మార్చలేనని పారిపోతుంది అంటూ ఎద్దేవా చేశారు. సమావేశంలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లెల వేణు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ శివారెడ్డి పాల్గొన్నారు.

## భర్త హత్య కేసులో భార్యతో కలిపి ముగ్గురు అరెస్టు

- అక్రమ సంబంధానికి అడ్డు తగులుతున్నాడనే కడతేర్చిన వైనం... ద్వి చక్ర వాహనం, 3 సెల్ ఫోన్లు స్వాధీనం
- అనంతపురం రూరల్ డీఎస్పీ ఆదేశాల మేరకు వివరాలు వెల్లడించిన అనంతపురం రూరల్ సి.ఐ



అనంతపురం, ఫిబ్రవరి11 (అనంత ప్రభ)

స్థానిక కియా మోటార్స్ ఎదురుగా ఉన్న చింత తోపులో ధర్మవరం మండలం మాల్కాపురం గ్రామానికి చెందిన దేవరకొండ కాశప్ప ఏ కాశిను హత్యకు గురయినట్లు ఈనెల 2 వ తేదీ అనంతపురం రూరల్ పోలీసులు గుర్తించారు. హతుడి భార్య దేవరకొండ సౌభాగ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని సి.ఐ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు

దేవరకొండ కాశప్ప అలియాస్ కాశి మరియు భార్య సౌభాగ్యలు స్థానిక కక్కలపల్లి టమోటా మండిలో కూలీలతో మేస్త్రీ పని చేయించి తిరిగి గ్రామానికి వెళ్ళే వారు. కాశప్ప 2 నెలల క్రితం తన పొలం అమ్మగా వచ్చిన డబ్బు తీసుకొని చీరల వ్యాపారం చేయడానికి హైదారాబాద్ కు వెళ్ళి అక్కడనే ఉండిపోయాడు. అతని భార్య సౌభాగ్య రోజు వచ్చి పనులు చేయించి వెళ్ళేది. ఈ క్రమంలో 2 నెలల క్రితం కర్ణాటక రాష్ట్రం, కోలార్ కు చెందిన నవాజ్ బేగ్, గౌస్ పీర్ లు సౌభాగ్య దగ్గర పనికి చేరారు. సౌభాగ్య మరియు నవాజ్ బేగ్ ల మధ్య అక్రమ సంబంధం ఏర్పడి టమోటా మండిలో మొత్తం తెలిసిపోయింది. అక్రమ సంబంధం విషయం సౌభాగ్య భర్తకు కూడా తెలిసి గొడవపడి మీ ఇద్దరినీ చంపుతామని కూడా కాశప్ప హెచ్చరించాడు. అక్రమ సంబంధం విషయం తన భర్తకు కూడా తెలిసిపోయిందని ...ఈ క్రమంలో భర్త అడ్డు తొలగించుకుంటే ప్రియుడితో హాయిగా ఉండొచ్చని సౌభాగ్య భావించింది. నవాజ్ తో చర్చించింది. గౌస్ తో కలిసి భర్తను హత్య చేయాలని కోరింది. ఈనేపథ్యంలో ఈనెల ఒకటో తేదీ స్థానిక కియా మోటార్స్ ఎదురుగా ఉన్న చింత తోపులోకి కాశప్పను నవాజు మరియు గౌస్ లు నమ్మించి తీసుకెళ్లారు. ఫుల్లుగా మద్యం తాగించేసి ఖాళీ బీరు బాటిల్ మరియు బండరాయితో బాది హత్య చేశారు. ఎవరికి అనుమానం కలగకూడదని సౌభాగ్య పోలీసులకు తన భర్తను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని ఈనెల మూడో తేదీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసు చేదింపు పనిలో నిమగ్నమైన సీఐ ఎన్ శేఖర్ కు పక్కా సమాచారం అందింది. అనంతపురం రూరల్ డీఎస్పి టీ వెంకటేష్ ఆదేశాల మేరకు సీఐ ఎన్ శేఖర్, ఎస్ఐ కె రాంబాబుల ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి స్థానిక ఆర్డీటీ స్టేడియం వద్ద ఉన్న ఈ ముగ్గురు నిందితులని అరెస్టు చేశారు.

అరెస్టయిన నిందితులు:

1) నవాజ్ బేగ్, 25 సం., బంగారుపేట్, కోలార్, కర్నాటక రాష్ట్రం
2) గౌస్ పీర్ ఏ గౌస్, 25 సం., కోలార్ టౌన్, కర్నాటక రాష్ట్రం
3) దేవరకొండ సౌభాగ్య, 36 సం., మల్కాపురం గ్రామం, ధర్మవరం మండలం

## కూడేరులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన స్థానిక సర్పంచ్



కూడేరు ఫిబ్రవరి11 (అనంత ప్రభ)

కూడేరు మండలం స్థానిక మండల కేంద్రంలోని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కందుల కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయం ఆవరణం నందు ఆర్ కె ఎస్ గోడన్ వద్ద కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ లలితమ్మ , తెదేపా నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం రోజున కందులను కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి ఎకరాకు అదనంగా నాలుగు క్వింటాళ్లు గా కొనుగోలు సామర్థ్యం పెంపుతో క్వింటా 7550 రూపాయలుగా నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లలితమ్మ, టిడిపి నాయకులు జయప్రకాష్ గౌడ్, బొమ్మయ్య, నారాయణస్వామి, గొల్ల వెంకటేష్ యాదవ్, ఎద్దుల సుధాకర్ నాయుడు, చిన్న ఈశ్వరయ్య, అంకే బీమా, రాయమ్మల వెంకటేష్, మసూద్ వలి, ముట్టాల అకులప్ప, గండి రామాంజనేయులు, తో పాటు ఏవో విజయ్ కుమార్, ఏఈఓ శైలజ, రైతు సేవా కేంద్ర సిబ్బంది రాజకుమార్, సాజియా, ఎంపీఈవో సరస్వతీ రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పండించిన కందులను క్వింటా ధర 7,550 రూపాయలతో కొనుగోలు చేస్తుందన్నారు. ఎకరాకు నాలుగు క్వింటాళ్ల ప్రకారం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, రైతులు ఎన్ని ఎకరాల్లో కంది పంట సాగుచేసిన కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలాగే మండల రైతులు తమతమ రైతుసేవా కేంద్రాల్లో తమ ఆధార్, మొబైల్ నెంబర్ మరియు పట్టాదారు పాస్ పుస్తకము తీసుకెళ్ళి 11అంకెల ( యూనిక్ కోడ్) విశిష్ట గుర్తింపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రాబోయే రోజుల్లో ఈ విశిష్ట గుర్తింపు ఉన్న రైతులకే పీఎం కిసాన్, పంట నష్ట పరిహారం,ఇన్సూరెన్స్, అన్నదాత సుఖీభవ మొదలగు వ్యవసాయ పథకాల మంజూరు అవుతాయి. కావున ఆయా గ్రామాల్లో రైతులు రైతు పాస పుస్తకాలకు విశిష్ట గుర్తింపు (యూనిక్ కోడ్) రిజిస్ట్రేషన్ ను తప్పని సరిగా చేయించుకొనవలెనని ఎం ఏ ఓ తెలియజేశారు.

## జేబీఎన్ న్యూస్ క్యాలెండర్లను ఆవిష్కరించిన తాడిపత్రి రూరల్ సిఐ శివ గంగాధర్ రెడ్డి మరియు ఎస్ఐ ధరణి బాబు



తాడిపత్రి, ఫిబ్రవరి 11 (అనంత ప్రభ)

జేబీఎన్ న్యూస్ క్యాలెండర్లను తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్ రెడ్డి మరియు ఎస్ఐ ధరణి బాబు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగాసిఐ శివగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను భుజాన వేసుకొని, ప్రజల పక్షాన వక్రాల్తుపుచ్చుకొని, ప్రభుత్వాధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు సమస్యలు ప్రతిబింబించడమే కాకుండా ఆ సమస్యల పరిష్కారానికి మార్గదర్శిగా నిలుస్తూ అన్ని వర్గాల ప్రజల మెప్పులు పొందుతోందని అభినందనలతో ముంచెత్తారు.

## న్యాయం కోసం అర్చుకులు పడి కాపులు



అనంతపురం, ఫిబ్రవరి11 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అర్చకుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఇబ్బందులు గురి చేస్తున్నాడంటే జనవరి 22వ తారీఖున దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయం వద్ద నిర్వహించడం జరిగింది. అనంతరం జాయింట్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అర్చకులు ఇచ్చిన ఫిర్యాదు మేర కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో విచా రణ ఆదేశించడం జరిగింది. ఈ విచారం రణకు దేవాలయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గైర్హాజరు కావడం జరిగింది. అర్చక సమాఖ్య సభ్యులు విచారణకు హాజరై విచారణ అధికారి అయినా తిప్పే నాయక్ కు రాతపూర్వకంగా సమాధానం చెప్పడం జరిగింది.

ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపూర్ జిల్లా అర్చక అధ్యక్షులు వై పి ఆంజనేయులు మరియు సభ్యులు మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్నారు. అర్చకులు అంటే అధికారికి అలుసుగా ఉంది అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ విచారణ పిలిచిన హాజరు కాకపోవడంలో ఆయన ఆంతర్యం ఏమిటో తెలియడం లేదు అన్నారు. అధికారం చేపట్టి నాప్పటినుంచి అధికారులకు చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అర్చకుల సమస్యల పట్ల పరిష్కారం చేయని అధికారపై తగు చర్యలు తీసుకోవాలని విచారణ అధికారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో, రాజన్న, విజయ్, హనుమంత రాయడు, రామసుబ్బయ్య, ప్రకాష్, చంద్రమౌళి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## చిలుకూరు ఆలయ అర్చకుడు రంగరాజన్న స్వామి పై దాడి హేయనీ మైన చర్య



అనంతపురం, ఫిబ్రవరి11 (అనంత ప్రభ)

బ్రాహ్మణ సేవా సంఘం సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి ప్రసాద్ రావు మంగళవారం రోజున విలేకరులతో మాట్లాడుతూ చిలుకూరు శ్రీ బాలాజీ దేవస్థానం అర్చక రంగరాజన్న స్వామి పై ఇటీవల దాడి చేసిన 'రామరాజ్యం' నాయకుడు వీరరాఘవరెడ్డి పై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు పి వి ప్రసాద్ రావు తీవ్రంగా మండిపడ్డారు. రామరాజ్యం పేరుతో ఒక దళాన్ని ఏర్పరచుకొని శ్రీరాముని పేరును అప్రతిష్టపాలు చేస్తున్నారు. ధార్మిక వాదులు, అర్చకులు, పురోహితులపై దాడి హేయమైన చర్య చట్టాన్ని ఉల్లంఘిస్తూ న్యాయ వ్యవస్థను సైతం కించపరిచేలా నిందిస్తూ, ఆలయ అర్చకులు రంగరాజన్న హింసించి వీడియోలు చేసి సోషల్ మీడియాలో హల్చల్ చేయటం చాలా దారుణమని వీరరాఘవ రెడ్డిని అదుపులోకి తీసుకున్న తెలంగాణ పోలీసులు, అతని అనుచర గణాన్ని కూడా అరెస్టు చేసి, కఠిన శిక్షలు అమలుపరచి శాంతిభద్రతలను కాపాడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు పి వి ప్రసాద్ రావు తెలిపారు.

## ఫ్యాక్షన్ కు పాల్పడితే కఠిన చర్యలు




యాడికి , ఫిబ్రవరి11 (అనంత ప్రభ)

ఫ్యాక్షన్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని యాడికి సీఐ ఈరన్న తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యాడికి సి ఐ ఈరన్న తన సిబ్బందితో మంగళవారం యాడికి మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాలైన నిట్టూరు, గుడిపాడు, కుందనకోట మరియు కమలపాడు గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాలలో గ్రామసభను ఏర్పాటుచేసి స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఫ్యాక్షన్ వల్ల కుటుంబాలు నాశనం అవుతాయని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఏవైనా సమస్యలు ఉంటే ముందుగా పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నియమాలు, డయల్ 100 మరియు సైబర్ వాలంటీర్ గురించి వివరిస్తూ, ప్రజలందరూ సైబర్ క్రైమ్ బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాసులు, కమలపాడు సచివాలయ మహిళా పోలీస్ ఇంద్రజ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి , ఫిబ్రవరి11 (అనంత ప్రభ)

యాడికి మండలం రాయల చెరువు గ్రామంలోని లీలావతి వృద్ధాశ్రమం నందు అన్నదానం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. తిమ్మాపురం ఉగ్గం చిన్న వెంకట రాముడు తన మనవడు ఉగ్గం ప్రేమ రక్షిత్ రెండవ జన్మదిన శుభ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి మరియు ఆశ్రమంలోని వృద్ధులు ప్రేమ రక్షిత్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉగ్గం రంగ పాల్గొన్నారు

## వినాయకుని గుడి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు



యాడికి, ఫిబ్రవరి 11 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డు వినాయక గుడి వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో చుట్టుపక్కల కాలనీల ప్రజలు

టిడిపి సీనియర్ నాయకులు క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి ,టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడును స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే స్పందించిన టిడిపి నాయకులు మంగళవారం స్పీడ్ బ్రేకర్లు వేయించారు. ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు వేయించినందుకు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, మాజీ ఎంపీటీసీ దడియాల ఆది, తెలుగు యువత నాయకుడు కోదూరు నీలకంఠారెడ్డి, తాంద్ర విక్రమ్, నరసింహ చౌదరి తదితరులు పాల్గొన్నారు

## టీవీ ఛానల్ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి హాజరైన యాడికి నటులు



యాడికి, ఫిబ్రవరి 11 (అనంత ప్రభ)

అనంతపురము జిల్లా కేంద్రములో సోమవారం జరిగిన ఓ టీవీ ఛానల్ బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు యాడికి పట్టణానికి చెందిన నటులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ యాడికి మండల కార్యదర్శి ప్రముఖ పౌరాణిక నటుడు జూటూరు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఛానల్ మంచి కార్యక్రమాలతో పలువురి మన్నన పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటులు జూటూరు అబ్దుల్ రజాక్, అబ్బా టీవీ డాక్టర్ హరిప్రసాద్, సాధు శేఖర్, మహబూబ్ బాషా, షేక్షావలి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.




## పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు స్థలాలు ఇవ్వాలి



శింగనమల, ఫిబ్రవరి 11 (అనంత ప్రభ)

ఏపీ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు పేదలకు ఇంటి స్థలాలు పక్కా గృహాలుప్రభుత్వము ద్వారా మంజూరు చేయాలని సిపిఐజిల్లాకార్యవర్గసభ్యులు డి చిన్నప్ప యాదవ్ ఆధ్వర్యంలో సింగనమల మండలం కల్లుమడి ,తరిమెల గ్రామాలలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు డి.చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ, నివేశన స్థలాలు లేని పక్కా గృహలు రాని లబ్ధిదారులు తో మాట్లాడి వారి అప్లికేషన్ లు వ్రాయడం జరిగినది గ్రామాలలో చాలామంది పేదలు స్థలాలు లేక ఇంటినిర్మాణినికి ప్రభుత్వము ఇచ్చేనగదు మెత్తము సరిపోక,గత ప్రభుత్వం ఇచ్చిన ఓకసెంటు, ఓకటిన్నర సెంటు స్థలాలు గృహాలు చాలక ఊరికి దూరంగా కాపురాలు ఉండడానికి అనువుగాని చోట స్థలాలు ఇవ్వడం వలన చాలామంది లబ్ధిదారులు ఆ ప్రాంతంలో ఉండడాన్ని ఇష్టపడక ఆ ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో కంపచెట్లపడి అద్వానంగా తయారైనది అందుకోసం ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి లబ్ధిదారులకు గ్రామాలలో మూడు సెంట్లు పట్టణాలలో రెండు సెంట్లు ప్రకారం కాపురాలకు అనుగుణంగా ఉండే స్థలాలను ఎంపిక చేసి ప్రభుత్వ స్థలాలు కానీ ప్రైవేటు స్థలాలు కానీ గుర్తించి వారికి స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే గృహ నిర్మాణానికి ఐదు లక్షలు, కంకర ,సిమెంట్ ,ఇనుము వస్తువులను ఉచితంగా అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ద్వారా డిమాండ్ చేస్తున్నాం. పాల్గోన్నవారు,రైతుసంఘము నీయోజకవర్గ అద్యక్షులు మధుయాదవ్ ,రామసుబ్బారెడ్డి,సుంకన్న,సురేష్ ,నాగరాజు, నల్లప్ప, అదెమ్మ, నల్లమ్మ, నాగవేణి,చికెన్ బాషా,మసూద్ వలి,వేంకటేశ్ రెడ్డి,మాబాషా, తదితరులుపాల్గోనడమైనది

## 143 జి.ఓ రద్దుపై పోస్టుకార్డు ఉద్యమం



అనంతపురం, ఫిబ్రవరి11 (అనంత ప్రభ)

ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షులు యమ్. నాగరాజు వారి అధ్యక్షన 143 మరియు 32 జి. ఓ. రద్దు చేయాలని పోస్టుకార్డు ఉద్యమం కార్యక్రమం జరిగినది.

వైద్య ఆరోగ్య శాఖ లో గత వైసిపి ప్రభుత్వం ఆనాలోచ్చితంగా తెచ్చిన జి. ఓ. నెంబర్ 143,మరియు 32 వలన వైద్య ఆరోగ్య శాఖలో రీడిప్లేయిమెంట్ మరియు ఉద్యోగుల కుదింపు పేరు తో ఉద్యోగులను తీవ్రమైన ఆందోళనకు గురించేస్తుంది. జనాభా పెరుగుతున్న కొద్ది ఆరోగ్య అవసరాలు మరియు కొత్త కొత్త వ్యాధుల వ్యాప్తి అరికట్టడానికి జనాభా ప్రత్తిపాధికన ఉద్యోగుల సంఖ్య ను పెంచాలి. కానీ గత ప్రభుత్వం ఇచ్చిన 143 జి. ఓ ద్వారా పి. ఎచ్. యన్.పోస్టులు 300 ల వరకు, సి. ఎచ్. ఓ. పోస్టులు 150 వరకు,యమ్. పి. ఎచ్. ఈ. ఓ.పోస్టులు 450 వరకు, యమ్. పి. ఎచ్. ఎస్ మగ మరియు ఆడ పోస్టులు వేయి వరకు, సూపెరవైజర్ క్యాడర్లు మరియు సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్స్, యల్. డి కంప్యూటర్, యఫ్. యన్. ఓ యమ్. యన్. ఓ ఆఫీస్ సబ్ ఆర్డినేట్ పోస్టులు అన్నింటి తో కలిపి దాదాపు 2500 పోస్టులు రద్దు అయ్యే ప్రమాదం ఉంది. అదే విదంగా ఏ. యన్. యమ్ రేడిప్లైమెంట్ వలన ప్రతి జిల్లా కి ముప్పైముదు రెగ్యులర్ ఏ. యన్. యమ్ పోస్టులు రద్ధవుతాయి. అనగా మొత్తం రాష్ట్ర వ్యాప్తంగావేయి కి పైగా ఏ. యన్. యమ్.పోస్టులు రద్దు అయ్యే అవకాశం ఉన్నది. కావునడు జి. ఓ ను వెంటనే రద్దు చేయాలని యూనియన్ డిమాండు చేస్తూ%ఖు%ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి పోస్టు కార్డు ఉద్యమం చేయాలని యూనియన్ పిలుపు నిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు యమ్. నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నందు అనంతపురం జిల్లాయూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, సత్య సాయి అధ్యక్షులు జె. రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టీ. మోహన్ బాబు, మరియు కె. మద్దయ్య పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించడం బాధ్యతగా భావించాలి




అనంతపురం, ఫిబ్రవరి11 (అనంత ప్రభ)

ఈరోజు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ వైద్య సిబ్బందికి కళ్యాణదుర్గలో డివిజనల్ స్థాయి సమీక్ష సమావేశం కళ్యాణ్ దుర్గం లోని ఆర్డిటి సంస్థ కార్యాలయం సమావేశ భవనం నందు నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి దేవి మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు సమయానికి ఎఫ్ ఆర్ ఎస్ నమోదు చేయాలని, అలాగే విధులలో ఉన్నప్పుడు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టే అన్ని ఆరోగ్య కార్యక్రమాల్లో మెరుగైన ప్రగతి నివేదికలు సాధించాలని, ముఖ్యంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, మాతా శిశు సంరక్షణ కార్యక్రమం,స్కూల హెల్త్ కార్యక్రమం, క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రాం, మొదలగు అన్ని కార్యక్రమాలు యందు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు,అలాగే

ప్రోగ్రాం అధికారి, డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది తమ పరిధిలోనిగ్రామాల్లోప్రతి ఇంటిని సర్వే నిర్వహించి ఎలిజిబుల్ కపుల్స్ యొక్క జాబితాలను తయారు చేయాలని అలాగే గర్భం దాల్చిన ప్రతి స్త్రీని గుర్తించి వీలైనంత తొందరగా రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా వారికి మెరుగైన వైద్య సేవలు అందించడానికి, సుఖ ప్రసాదం జరగడానికి,తల్లి బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడ్డానికి,తద్వారా మాతృ మరణాలు శిశు మరణాలు నివారించడానికి ఉపయోగపడుతుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ కుమార్, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనా అధికాకి గంగాధర్ తో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్వైజర్లు, యం ఎల్ హెచ్ పి లు,ఏఎన్ఎమ్స్, పాల్గొన్నారు

## వైసీపీ ఎల్లప్పుడూ ప్రజా పక్షమే.
## రాష్ట్ర సమస్యలను ప్రస్తావిస్తే ఎదురుదాడి చేస్తారా.



అనంతపురం, ఫిబ్రవరి11 (అనంత ప్రభ)

రాష్ట్ర సమస్యలు పార్లమెంట్ లో ప్రస్తావిస్తే వాటికి పరిష్కారం లభిస్తుందని వైసీపీ పార్లమెంట్ సభ్యుడు మిథున్ రెడ్డి ప్రయత్నం చేస్తే కూటమి ఎంపీలు దానిని కూడా విమర్శలు చేయడం సిగ్గుచేటు అని నగర మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడూ ప్రజా సమస్యలపై పోరాడుతూ ఉంటుందన్నారు.అందులో భాగంగా వైసీపీ పార్లమెంట్ సభ్యుడు మిథున్ రెడ్డి పార్లమెంట్ సమావేశాలలో రాష్ట్ర సమస్యలను ప్రస్తావించారన్నారు.దేశంలోనే అతి పెద్ద మార్గదర్శి చిట్ ఫండ్ మోసాల గురించి,విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రవేటికరణ నిలుపుదల, పోలవరం, రాష్ట్రంలో మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తి వంటి సమస్యలను పార్లమెంట్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లారన్నారు.అయితే కూటమి ఎంపీలు రాష్ట్ర సమస్యల పరిష్కారంలో పార్లమెంట్ సభ్యుడు మిథున్ రెడ్డికి మద్దతుగా నిలవాల్సింది పోయి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే మిథున్ రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శలు చేయడం సరికాదన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీద చేస్తున్న ఆరోపణలకు ప్రజా సమస్యల గురించి ఎంపీ మిధున రెడ్డి మాట్లాడిన అంశాలకు సంబంధం లేకున్నా కావాలనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీద ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేవలం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై వ్యక్తిగత కక్షతోనే టీడీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారన్నారు.గతంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేద విద్యార్థులకు ఉన్నత చదువులు చదివించేందుకు ఫీజురీఎంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేస్తే ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు.నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకుండా కేవలం కక్ష సాధింపులకే పరిమితం అయ్యిందని అందులో భాగంగానే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై రోజుకొక కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి నేతలు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

## మన మిత్ర సేవా విధానాన్ని ప్రవేశ పెట్టిన విద్యుత్ శాఖ ఏ.ఏ ఓ ఎస్ నరసప్ప





తాడిపత్రి ఫిబ్రవరి 11(అనంత ప్రభ)

మన రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర సేవా విధానాన్ని విద్యుత్ శాఖ బిల్లుల చెల్లింపునకు పూర్తీ స్థాయి లో వినియోగ దారులు సులభంగా, ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా వినియోగించే విధంగా బిల్లుల చెల్లింపు విధానాన్ని తాడిపత్రి విద్యుత్ శాఖ అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ తమ కార్యాలయం లో మరియు అన్నీ బిల్లులు చెల్లింపు కేంద్రాల వద్ద ఫ్లెక్సీ లను 11-02-2025 ఏర్పాటు చేసారు. ఈ సంధర్భంగా ఏ.ఏ ఓ ఎస్ నరసప్ప ఈ మన మిత్ర ద్వారా చెల్లింపు పద్ధతిని వినియోగ దారులకు వివరించారు. ఈ కార్యక్రమం లో ఏ.ఏ ఓ, ఇఆర్ఓ విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు మాధురి ప్రశ్న పత్రాలు పంపిణీ




అనంతపురం ఫిబ్రవరి11 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం చా బాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థిని ,విద్యార్థులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రూపొందించిన మాధురి ప్రశ్న పత్రాలను గ్రామ సర్పంచ్ మల్లెల జగదీష్ మండల విద్యాధికారి తిమ్మప్ప గారి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మరియు మండల విద్యాధికారి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్రప్ప ఉపాధ్యాయులు కరణం శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు లాలు సాహెబ్, దాదా హనీఫ్, ఎస్ ఎం సి సభ్యులు లేపాక్షి పాల్గొన్నారు.

## గొప్ప మానవత్వానికి ఉదాహరణ - నంగి భూమిక, తాను చనిపోయి ఐదుగురికి ప్రాణం పోసిన వైద్యురాలు



అనంతపురం, ఫిబ్రవరి 11 (అనంత ప్రభ)

అనంతపురం తెలుగుదేశం యమ్. పి. అంబికా లక్ష్మీనారాయణ డాక్టర్. నంగి భూమిక మరణించిన విషయం తెలుసుకొని ఆమెకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా, తలుపుల మండలం, నంగివడ్లపల్లి గ్రామానికి చెందిన నంగి భూమిక గారి అకాల మృతిచెందడం చాలా బాధాకరం. హైదరాబాద్ కామినేని ఆసుపత్రుల్లో ఇంటర్న్ డాక్టర్‌గా (హౌస్ సర్జన్) పని చేస్తున్న భూమిక, ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయితే, ఆమె తండ్రి నంగి నంద కుమార్ రెడ్డి గారు ఎంతో గొప్ప మనోధైర్యంతో తన కుమార్తె కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులను దానం చేసి ఐదుగురికి కొత్త జీవితం ఇచ్చారు. ఈ మహోన్నత నిర్ణయం మన అందరికీ స్ఫూర్తిదాయకం. భూమిక గారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఔదార్యానికి నా హృదయపూర్వక నమస్కారాలు. ఆ దేవుడు వారి కుటుంబానికి శక్తిని ప్రసాదించాలని కోరుకుంటున్నాను...

## వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం.



శింగనమల, ఫిబ్రవరి 11 (అనంత ప్రభ)

సింగనమల మండల పరిధిలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన చింతాకు లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుస్తున్న వైసీపీ నాయకులు దాసరి వెంకటనారాయణ మంగళవారం గురుగుంట్ల గ్రామానికి వెళ్లి లక్ష్మమ్మ వైద్య ఖర్చులకు 10000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ఆర్థిక సాయం చేయడం తనకు దేవుడు ఇచ్చిన వరమని అన్నారు అలానే భవిష్యత్తులో ఆరోగ్యంతో బాధపడుతున్న వారికి తమ వంతు సహాయంగా ఆర్థిక సహాయం అందించుటకు ముందుంటానని అన్నారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిహెచ్ సిలో మధ్యాహ్నానికే వైద్యులు మాయం ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యుల కుర్చీలు




శింగనమల, ఫిబ్రవరి 11 (అనంత ప్రభ)

నియోజకవర్గ కేంద్రమైన శింగనమల ప్రభుత్వ వైద్యశాలలో 24 గంటలు వైద్యులు రోగులకుచికిత్స అందించాలని ఉన్నా దీన్ని తుంగలో తొక్కి శింగనమల సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విధులకు పంగనామాలు పెట్టి మధ్యాహ్నం రెండు గంటలకే కుర్చీలు ఖాళీ చేసి ఇళ్లకు చేరుకుంటున్నారు, ఎన్నిసార్లు జిల్లా స్థాయి అధికారులకు, తెలియజేసిననూ, తూతూ మంత్రంగా విచారణలు జరిపి వైద్యులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, ఆసుపత్రికి వచ్చిన రోగులు నిరాశ నిస్పృహలతో వెను తిరగాల్సిన పరిస్థితి దాపురించిందని ప్రజలు వాపోతున్నారు, ఆసుపత్రిలో రోగులకు సరైన వైద్యం కూడా అందించక, అడిగిన వారిపై సిబ్బంది దౌర్జన్యాలకు పాల్పడుతూ రోగులను ఇబ్బందులపాలు చేస్తున్నారని, వాపోతున్నారు, ఆసుపత్రిలో వైద్య సేవలు, ఈసీజీ, ఎక్స్ రే, రక్త పరీక్షల యంత్రాలు, సక్రమంగా పనిచేయక రోగులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని, రోగుల సౌకర్యార్థమై, రక్త పరీక్షలు , ఈసీజీ, ఎక్స్ రే, యంత్రాలను తక్షణమే ఆధునుకీకరించి ఆసుపత్రి సిబ్బందిని గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా జిల్లా మెడికల్ అధికారి, సిహెచ్ సి వైద్య సిబ్బంది పై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# సౌత్ ను ఏలుతున్న త్రిష.. సీనియర్ హీరోయిన్లకు ఇదేనా ఛాలెంజ్!





సౌత్ లో బడా హీరోయిన్ల జాబితాలో త్రిష పేరు ఉంటుందనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రెండున్నర దశాబ్దాలుగా దక్షిణాది ఆడియెన్స్ ను వరుస చిత్రాలతో అలరిస్తోంది. విభిన్న పాత్రలతో వెండితెరపై ఆకట్టుకుంటోంది. ఇప్పటికీ వరకు బడా స్టార్స్ సరసన నటించి మెప్పించింది. తన నటనతో ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది.

ఇండస్ట్రీలో తనదైన శైలిని ప్రదర్శిస్తూ స్పెషల్ ఇమేజ్ ను సొంతం చేసుకున్నారు. పేరు తమిళ హీరోయిన్ అయినా.. తెలుగు ఆడియెన్స్ కు ఎక్కడా ఆ తేడా కనిపించకుండా కెరీర్ ను సాగించింది. ఇప్పటికీ వరుస చిత్రాలతో అలరిస్తూనే ఉంది. స్టార్ హీరోలకు జోడీగా కనిపించడమే కాకుండా ఫీమేల్ ఓరియెంటెడ్ కథలతోనూ తనదైన మార్క్ ను ప్రదర్శిస్తోంది.

తెలుగులో 'వర్షం' చిత్రంతో త్రిష సెన్సేషన్ గా మారిన విషయం తెలిసిందే. దాదాపుగా రెండు దశాబ్దాల కింద విడుదలైన ఈ చిత్రం నేటికీ ఆడియెన్స్ గుండెల్లోనే పదిలంగా ఉంది. డార్లింగ్ ప్రభాస్ సరసన త్రిష నటనకు అప్పట్లో మంచి మార్కులు పడ్డాయి. ఆమె టాలెంట్ తో ఇండస్ట్రీ పెద్దలనూ మెప్పించింది. ఆ తర్వాత నుంచి వరుస ఆఫర్లను దక్కించుకుని స్టార్ హీరోయిన్ గా ఎదిగిన విషయం తెలిసిందే. 20 ఏళ్లకు పైగా తన నటనా జీవితాన్ని విజయ పథంలో నడిపిస్తోంది. ఫ్యాన్స్ ను మరింతగా ఆకట్టుకుంటూనే ఈతరం ఆడియెన్స్ ను కూడా తన దారిలోకి తెచ్చుకుంటోంది.
100 కోట్ల క్లబ్‌లో అజిత్ మూవీ.. డిజాస్టర్ టాక్‌లో విదాముయార్చి సంచలనం"100 కోట్ల క్లబ్‌లో అజిత్ మూవీ.. డిజాస్టర్ టాక్‌లో విదాముయార్చి సంచలనం"

ఇదిలా ఉంటే.. రెండున్నర దశాబ్దాలుగా త్రిష సినీ ఇండస్ట్రీలో యాక్టివ్ గా కనిపిస్తున్నారు. అయితే ప్రస్తుతం చలనచిత్ర పరిశ్రమలో భారీ మార్పులు జరుగుతున్న విషయం తెలిసిందే. తెలుగు సినిమాలకు వరల్డ్ వైడ్ మార్కెట్ పెరగడంతో కొత్త హీరోయిన్లకూ అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఛాలెంజింగ్ రోల్స్ లో హీరోయిన్లను ఎంపిక చేయడం దర్శకనిర్మాతలకూ సవాల్ గానే మారుతోంది. ఈక్రమంలో యంగ్ హీరోయిన్లు కూడా తమ యాక్టింగ్ స్కిల్ తో ఆఫర్లను అందుకుంటూనే ఉన్నారు.

ఇన్ని పరిస్థితుల మధ్య కూడా ప్రస్తుతం భారీ చిత్రాలను లైనప్ చేసిన సీనియర్ హీరోయిన్ ఎవరంటే.. త్రిష పేరే చెప్పాలి. ప్రజెంట్ ఈ ముద్దుగుమ్మ ఏకంగా అరడజన్ ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉంది. అందులో నుంచి తమిళ చిత్రం 'విదాముయార్చి' చిత్రంతో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అజిత్ హీరోగా నటించిన ఈమూవీ ప్రేక్షకాదరణను పొందుతోంది. బాక్సాఫీస్ వద్ద కూడా మంచి జోరు కనబరుస్తోంది. ఇక ప్రమోషన్స్ లో త్రిష సందడి చేస్తూ ఫ్యాన్స్, ఆడియెన్స్ ను ఆకట్టుకుంటూనే ఉన్నారు.

ఇదే క్రమంలో త్రిష లైనప్ పరిశీలిస్తే షాకింగ్ గా ఉంది. సెకండ్ ఇన్నింగ్స్ లోనూ భారీ చిత్రాలను లైనప్ లో పెట్టి ఆశ్చర్యపరుస్తోంది. యంగ్ హీరోయిన్లను దాటుకొని అవకాశాలను చేజిక్కించుకుంటోంది. తమిళంలో 'విదాముయార్చి' అలరించగా.. గుడ్ బ్యాడ్ అగ్లీ, కమల్ హాసన్ థగ్ లైఫ్, సూర్య 45, మలయాళంలో రామ్, ఇక తెలుగు మెగాస్టార్ చిరంజీవి – వశిష్ట కాంబోలోని 'విశ్వంభర' చిత్రంలోనూ హీరోయిన్ గా నటిస్తోంది.

ఇప్పటికే చిరు సరసన స్టాలిన్ మూవీలో నటించింది. ఇక ఎనిమిదేళ్ల తర్వాత తెలుగులో 'విశ్వంభర'లో నటిస్తుండటం.. పైగా చిరు సరసన త్రిష ఎలాంటి మేజిక్ చేస్తుందోనని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇలా త్రిష సౌత్ సినిమాలను ఏలుతూ ఫుల్ బిజీగా ఉండటం సంతోషంగా ఉందంటున్నారు అభిమానులు.




# బ్లూ కలర్ డ్రెస్‌లో రకుల్ స్టన్నింగ్ లుక్..



సాధారణంగా ఆర్మీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న కుటుంబంలో అంతా ఎంత స్ట్రిక్ట్‌గా ఉంటారో తెలిసిందే. అలాంటి ఫ్యామిలీ నుంచి వచ్చి టాప్ హీరోయిన్‌గా ఎదిగారు రకుల్ ప్రీత్ సింగ్. ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అనతికాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్ అందుకున్నారు రకుల్. ప్రస్తుతం తెలుగు తెరకు దూరంగా హిందీలోనే తన అదృష్టం పరీక్షించుకుంటున్నారు. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

10 అక్టోబర్ 1990న పంజాబీ సిక్కు కుటుంబంలో న్యూఢిల్లీలో జన్మించారు రకుల్ ప్రీత్ సింగ్. ఆమె తండ్రి కుల్విందర్ సింగ్ ఆయన ఆర్మీలో ఆఫీసర్.. తల్లి రాజేందర్ కౌర్. ధౌలా కౌన్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం, ఢిల్లీలోని జీసస్ అండ్ మేరి కాలేజీలో మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు రకుల్. క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడే తత్వాన్ని తన పేరెంట్స్ నుంచే నేర్చుకున్నానని రకుల్ ఎన్నో వేదికలపై తెలిపారు ఈ ముద్దుగుమ్మ. వారే తనకు ఇన్స్‌పిరేషన్ అని.. జీవితంలో అనుకున్నది సాధించడానికి తనను వెన్నుతట్టి ప్రోత్సహించారని తన తల్లిదండ్రుల గురించి గొప్పగా చెబుతుంటారు.

అందరూ నటనపై ఆసక్తితోనో, ప్యాషన్‌తోనో సినీ పరిశ్రమలో అడుగుపెడుతుంటారు. అయితే రకుల్ మాత్రం కేవలం పాకెట్ మనీ కోసం ఇండస్ట్రీలో అడుగుపెట్టారట. తొలుత కన్నడంలో గిల్లి సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన రకుల్.. తర్వాత మోడలింగ్‌లో దుమ్మురేపారు. సందీప్ కిషన్ హీరోగా నటించిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీతో తెలుగువారిని పలకరించారు . ఈ సినిమాలో ఆమెకు నేమ్ అండ్ ఫేమ్ వచ్చింది . వచ్చిన ప్రతి అవకాశాన్ని అందుకుంటూ టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందారు. చిన్నా, పెద్దా అందరికీ రకుల్ ప్రీత్ సింగే హీరోయిన్‌గా కావాలి అన్నంతగా బలమైన ముద్రవేశారు.

టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలోనూ ఛాన్స్‌లు పట్టేసింది రకుల్. తన సంపాదనను తెలివిగా పలు వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి రెండు చేతులా సంపాదిస్తున్నారు. బాలీవుడ్ నటుడు, నిర్మాత అయిన జాకీ భగ్నానితో కొన్నాళ్లు డేటింగ్ చేసిన రకుల్ ప్రీత్ సింగ్ ఆయనను పెళ్లాడారు. ప్రస్తుతం హిందీలో దే దే ప్యార్ దే 2లో నటిస్తున్నారు. అన్షుల్ శర్మ దీనికి దర్శకుడు కాగా వచ్చే ఏడాది మార్చిలో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నారు.

# లైలా బాయ్‌కాట్.. వైసీపీ శ్రేణుల ఆగ్రహం.. చిక్కుల్లో హీరో విశ్వక్ సేన్!






మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లైలా. ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఆకాంక్ష శర్మ, కామాక్షి భాస్కర్ల కీలక పాత్రల్లో నటించారు. ఇటీవల రిలీజైన సినిమా ట్రైలర్‌కు అనూహ్యంగా స్పందన లభించింది. ఈ క్రమంలో ప్రమోషన్‌లో భాగంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయితే ఈ వేడుకలో 30 ఇయర్ ఇండస్ట్రీ పృథ్వీ చేసిన కామెంట్స్ వైరల్ అవ్వడమే కాకుండా వివాదాస్పదమయ్యాయి. ఈ వివాదం గురించిన వివరాల్లోకి వెళితే..

లైలా ప్రీ రిలీజ్ వేడుకలో భాగంగా యాక్టర్ పృథ్వీ మాట్లాడుతూ.. సినిమాలో మేకల సత్తి అనే పాత్రలో నటిస్తున్నాను. నా వద్ద 150 మేకలు ఉండేవి. కానీ చివరకు 11 మేకలే మిగులుతాయి అనే విధంగా కామెంట్స్ చేశారు. అయితే 11 నంబర్‌ను తన స్పీచ్‌లో వాడటంపై పృథ్వీపై వైసీపీ శ్రేణులు విరుచుకుపడ్డారు. సోషల్ మీడియాలో బాయ్‌కాట్ లైలా అనే హ్యాష్ ట్యాగ్‌ను ట్రెండ్ చేశారు.

పృథ్వీ వ్యాఖ్యలు వివాదంగా మారడంతో విశ్వక్ సేన్ సందిగ్ధంలో పడ్డారు. ఆయనకు వైసీపీ నేతలు, సినీ వర్గాలు కాల్ చేసి వివాదాన్ని తగ్గుముఖం పట్టించేలా చర్యలు చేపట్టాలని సలహాలు ఇచ్చారట. వైసీపీ శ్రేణులు బాయ్‌కాట్ పిలుపు ఇస్తే సినిమాపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి వారితో మాట్లాడి వివాదాన్ని ముగిసేలా చూసుకోవాలని సూచించారట.

దాంతో లైలా మూవీ యూనిట్ వెంటనే ఈ వివాదంపై క్లారిటీ ఇచ్చేందుకు ప్రెస్ మీట్ నిర్వహిస్తున్నది. వైసీపీ శ్రేణులు ఇచ్చిన బాయ్‌కాట్ ఉపసంహరించుకొనేలా వారికి వివరణ ఇవ్వాలని స్వయంగా విశ్వక్ సేన్ మీడియాతో మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో ప్రెస్ మీట్‌లో విశ్వక్ సేన్ ఏం మాట్లాడుతారనే విషయం ఆసక్తిగా మారింది.

ఇదిలా ఉండగా, విశ్వక్ సేన్‌కు వైసీపీ నేతలకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వారితో ఇప్పటికే చర్చలు జరిపారు. ఈ వివాదాన్ని పెద్దగా పట్టించుకోవద్దు. పృథ్వీ తన క్యారెక్టర్‌కు సంబంధించిన సన్నివేశాన్ని కామెడీగా చెప్పారు. అందులో ఎలాంటి వివాదం లేదని క్లారిటీ ఇచ్చారని తెలిసింది. ఫిబ్రవరి 14వ తేదీన రిలీజ్ కానున్న ఈ సినిమా వివాదాన్ని చిత్ర యూనిట్ ఎలా పరిష్కరించుకొంటారనేది ఆసక్తిగా మారింది.

# ఒక పథకం ప్రకారం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్దార్థ్ నీలకంఠ (సాయిరాం శంకర్) డ్రగ్స్ బానిస అవుతాడు. తనకు సన్నిహితురాలైన దివ్య (భానుశ్రీ) హత్య కేసులో నిందితుడిగా ఇరుక్కుపోతాడు. దాంతో పబ్లిక్ ప్రాసిక్యూటర్ హోదా నుంచి కోర్టు తొలగిస్తుంది. తాను నిరపరాధిని అని కోర్టులో డిఫెన్స్ లాయర్ చినబాబు (కళాభవన్ మణి)తో పోటీ పడలేకపోతాడు. ఈ పరిస్థితుల్లో డిఫెన్స్ లాయర్ భార్య శ్వేత హత్యకు గురి అవుతుంది. ఆ నేరం కూడా సిద్దార్థ్‌పైనే పడుతుంది. ఇలా సీరియల్ మర్డర్స్‌తో సిద్దార్థ్ లైఫ్ అగమ్యగోచరంగా మారిపోతుంది.

సిద్దార్థ్ డ్రగ్స్‌కు ఎందుకు బానిస అయ్యాడు? తన భార్య సీత (ఆషిమా నర్వాల్)కు ఏమైంది? అదృశ్యమైన సీత కోసం సిద్దార్థ్ ఎలాంటి ప్రయత్నాలు చేశాడు? దివ్యను ఎవరు హత్య చేశారు? మర్డర్ కేసులను ఏసీపీ కవిత (శృతి సోది), రఘురామ్ (సముద్రఖని) ఎలా దర్యాప్తు చేశారు. హత్య కేసుల్లో సిద్దార్థ్‌ను పక్కా పథకం ప్రకారం ఇరుకించే ప్రయత్నం చేశారు? చివరకు హంతకుడిని సిద్దార్థ్ పట్టుకొన్నాడా? తాను నిర్దోషినని సిద్దార్థ్ ఎలా నిరూపించుకొన్నాడు? హత్యలకు పాల్పడుతున్న హంతకుడి ఆట ఎలా కట్టించాడు అనే ప్రశ్నలకు సమాధానమే ఒక పథకం ప్రకారం సినిమా కథ.

దర్శకుడు వినోద్ కుమార్ విజయన్ విషయానికి వస్తే.. మర్డర్ మిస్టరీ పాయింట్ రాసుకొన్న విధానం.. దానిని ఆడియెన్స్‌లో క్యూరియాసిటీ పెంచేలా సన్నివేశాలను డిజైన్ చేసుకొన్న విధానంతో సక్సెస్ సాధించాడు. ఫస్టాఫ్‌లో ఆయన టేకింగ్ విషయంలో కొంత తడబాటు కనిపించినా..సెకండాఫ్‌లో ఇంటెలిజెంట్ స్క్రీన్ ప్లేతో స్టోరిని గ్రిప్పింగ్‌గా నేరేట్ చేయడమే కాకుండా సన్నివేశాలను పరుగులు పెట్టించాడు. సాయిరాం శంకర్ బాడీ లాంగ్వేజ్, యాటిట్యూడ్‌కు తగినట్టుగా సిద్దార్థ్ పాత్రను డిజైన్ చేసి ఆయన నుంచి మెచ్యూరిటీతో కూడిన పెర్ఫార్మెన్స్‌ను రాబట్టుకొన్నాడు. కేవలం మర్డర్, సస్పెన్స్ థ్రిల్లర్‌గానే కాకుండా మంచి లవ్ స్టోరీతో, సిద్ శ్రీరామ్‌తో ఫీల్ గుడ్ పాటలతో ఆడియెన్స్ మంచి అనుభూతిని పంచారు.

ఇక నటీనటుల పెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. సాయిరాం శంకర్ యాక్టింగ్ బాగుంది. లాయర్‌గా, భార్యను మిస్ అయి డ్రగ్స్ బానిసైన భర్తగా, మర్డర్ మిస్టరీని ఛేదించే ఇన్వెస్టిగేటర్‌గా పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలో మెప్పించారు. సినిమా భారాన్నంత తన భుజాల మీద వేసుకొని పూర్తిగా తన పాత్రకు న్యాయం చేశాడు. ఇక సముద్రఖని ఓ పెక్యులర్ డైలాగ్ డెలివరీతో కామెడీ పండిస్తే.. శృతి సోది, కళాభవన్ మణి, ఆషిమా నర్వాల్ అందరూ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు.

అలాగే సాంకేతిక విభాగాల పనితీరు విషయానికి వస్తే.. మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫి, స్క్రీన్ ప్లే ఈ మూవీకి ప్లస్ పాయింట్స్. సిద్ శ్రీరామ్ పాడిన రెండు పాటలు కూడా మంచి ఫీల్‌తో తెర మీద కనిపించాయి. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించిన గోపి సుందర్ సెకండాఫ్‌లో చాలా సీన్లను భారీగా ఎలివేట్ చేశారు. దర్శకుడు అనుసరించిన స్క్రీన్ ప్లేకు తగినట్టుగా సినిమాటోగ్రఫి, ఎడిటింగ్ విభాగాలు చక్కటి సహకారం అందించారు. నిర్మాతలు వినోద్ కుమార్ విజయన్, గార్లపాటి రమేష్, సహనిర్మాతలు జీను మల్లి, స్వాతి కల్యాణి అనుసరించిన నిర్మాణ విలువలు బాగున్నాయి. ఈ సినిమాకు చాలా మంది నేషనల్ అవార్డు విన్నర్స్ పనిచేయడం విశేషంగా చెప్పుకోవాలి.

ఒక పథకం ప్రకారం సినిమా గ్రిప్పింగ్‌గా, ఇంటెలిజెంట్ స్క్రీన్ ప్లేతో సాగే లవ్, ఎమోషనల్ డ్రామా. మర్డర్ మిస్టరీగా రూపొందిన ఈ సినిమాలో చాలా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఫస్టాఫ్‌లో కొంత నిదానంగా నడిచినప్పటికీ.. సెకండాఫ్ రేసీగా సాగి మంచి అనుభూతిని పంచుతుంది. స్క్రీన్ ప్లేలో ఉండే దమ్ముతోనే కథలో విలన్ గుర్తించడానికి పట్టుకొంటే పదివేలు అనే పోటీని



పెట్టడం వారికి సినిమాపై ఉన్న నమ్మకానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. యాక్షన్, సస్పెన్స్ థ్రిల్లర్స్ ఇష్టపడే వారికి ఒక పథకం ప్రకారం తప్పకుండా నచ్చుతుంది. మాస్ ఆడియెన్స్ పక్కాగా ఆకట్టుకొనే అంశాలు ఉన్నాయి. ఈ వారం కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు చూడాలనుకొనే వారు ఈ సినిమాను థియేటర్‌లో తప్పకుండా చూడాల్సిన థ్రిల్లర్ మూవీ.

PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com